క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



ఉదయగిరి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై–2 ఏ శ్రీనును ఎస్సై–1 ఇంద్రసేనారెడ్డి, పోలీసు సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రి నారాయణ, ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారాన్ని అందుకోవడంపై అభినందించారు. కానిస్టేబుళ్లు పెంచలయ్య, శ్రీనివాసులు, ప్రభాకర్, అశోక్, గోవిందు, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో అవధూత భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విశేషాభిషేకాలు, పూజలు, హోమగుండ ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కావలి (జలదంకి): కావలిలోని ముసునూరు ఆంజనేయస్వామి గుడి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాల పాలయ్యారు. వివరాలు...ఆంజనేయస్వామి గుడిలో అర్చకుడిగా పనిచేస్తున్న ఎస్ బాబు కావలిలోని ఇంటి వద్ద నుంచి గుడి వద్దకు స్కూటీపై వస్తున్నాడు. అదే సమయంలో ముసునూరుకు చెందిన వీ మహేంద్రబాబు ముసునూరు నుంచి కావలికి మోటార్‌సైకిల్‌పై వస్తున్నాడు. ఆంజనేయస్వామి గుడి సమీపంలోకి వచ్చేసరికి రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కావలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంపై అవగాహన

కావలి (జలదంకి): కావలిలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. కావలి ఆర్డీవో సన్నీవంశీకృష్ణ పాల్గొని విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేందుకు చేయాల్సిన వ్యాయామాలు, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. పట్టణానికి చెందిన డాక్టర్లు నళిని పద్మ, మాధురి, రాధికారెడ్డి, రమ్య తదితరులు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇలీంద్ర మాధవరావు వసతిగృహానికి వంద చాపలు, బోరెడ్డి రజని 10 ఎమర్జెన్సీ లైట్లు వితరణ చేశారు. రెడ్‌క్రాస్ బాధ్యులు, హాస్టల్ కమిటీ సభ్యులు, ట్యూషన్ టీచర్స్ పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో వృద్ధురాలు


- అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు నిలిపిన వైద్యసిబ్బంది



చికిత్స పొందుతున్న పెంచలమ్మ

ఆత్మకూరు: ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి శనివారం అనారోగ్యంతో వచ్చిన ఓ వృద్ధురాలు ఓపీ వద్దే స్పృహతప్పి పడిపోయి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. వెంటనే స్పందించిన వైద్యసిబ్బంది అత్యవసర వైద్యం అందించి ఆమె ప్రాణాలను నిలిపారు. వివరాలు.. అనంతసాగరం మండలం సంజీవనగరానికి చెందిన పెంచలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఒక్కటే ఆత్మకూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. ఓపీ రాయించుకుని వైద్యుడి వద్దకు వెళ్లి చూపించుకునేలోగానే ఆమె ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయింది. అదే సమయంలో అటుగా వస్తున్న డాక్టర్ బాలాజీ ఆమె పరిస్థితిని గమనించి వెంటనే ఐసీయూకి తరలించి అత్యవసర చికిత్స అందించారు. సుమారు గంట తరువాత ఆమె కోలుకుంది. వెంటనే స్పందించి ప్రాణాలు నిలిపిన డాక్టర్ బాలాజీని పలువురు అభినందించారు.

ప్రమాదభరితంగా చెట్టు



సోమశిల: స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ఎంపీయూపీ పాఠశాల మైదానంలో వేపచెట్టు మోడువారి ప్రమాదభరితంగా ఉంది. పూర్తిగా ఎండిపోయిన చెట్టును తొలగించకుండా అలాగే వదిలేశారు. దీంతో బలమైన గాలులు వీచిన సమయంలో కొమ్మలు విరిగి పడుతుండడంతో విద్యార్థులకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కృష్ణా..ముకుందా..మురారీ

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు | భక్తులతో కిటకిటలాడిన కృష్ణ మందిరాలు



కావలిలోని రైల్వేరోడ్డు గీతా మందిరంలో విశేషాలంకారంలో శ్రీకృష్ణుడు

కావలి (జలదంకి): కావలి పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాతూరులోని శ్రీకృష్ణుని మందిరం, రైల్వేరోడ్డులోని గీతామందిరంతో పాటు రూరల్ పరిధిలోని శ్రీకృష్ణుని ఆలయాల్లో కృష్ణుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మూలవిరాట్టులను వెన్న, డ్రైఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్రనామ, శ్రీకృష్ణ అష్టోత్తర శతనామ పారాయణం చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టికొట్టారు. అనంతరం శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీలు, యాదవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో పాల్గొని సందడి చేశారు. కాగా యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని దొడ్ల మనోహర్‌రెడ్డి కల్యాణ మండపంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చలంచర్లలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

- జలదంకి: స్థానిక యాదవవీధిలోని శ్రీకృష్ణుని మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుకి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు భగవద్గీత శ్లోకాలు, శ్రీకృష్ణుని భక్తి గీతాలు ఆలపించారు.



ఆత్మకూరు: టెంకాయతోపు రాధాకృష్ణ మందిరంలో కల్యాణోత్సవం



ఆత్మకూరు: కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు



ఆత్మకూరు: హిల్‌రోడ్డులోని శ్రీకృష్ణమందిరంలో కల్యాణోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీకృష్ణ మందిరాల్లో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. హిల్‌రోడ్డు కృష్ణమందిరంలో ఉదయం మూలవిరాట్టుకు విశేషాభిషేకాలు నిర్వహించి పూలతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం 11 గంటలకు అర్చకులు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుని అలంకరణలో భక్తులను ఆకట్టుకున్నారు. అలాగే టెంకాయతోపులోని రాధాకృష్ణ మందిరంలో రాధాకృష్ణ, సత్యభామ విగ్రహాలను సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సోమవరపు యానాదిరెడ్డి, శ్రీలత, డాక్టర్ దయాకర్‌రెడ్డి, సంయుక్త దంపతులు, భరత్ కృష్ణారెడ్డి, సౌమ్య దంపతులు కల్యాణ మహోత్సవానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

- సంగం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. సంగంలోని తూర్పువీధిలోని కృష్ణమందిరంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు తమ చిన్నారులను చిన్నికృష్ణులుగా అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు.
- కొండాపురం: మండలంలోని లింగనపాళెంలో మందపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కొమ్మి సత్యవోలు గ్రామాల్లో సాయంత్రం విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.
- అనుమసముద్రంపేట: స్థానిక కృష్ణ మందిరంలో శ్రీకృష్ణుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం రుక్మిణి, సత్యాభామ సమేత శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కళ్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా సింగంశెట్టి వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బమ్మ వ్యవహరించారు.

అనంతరం వాహన, ఊంజల్ సేవలు, మహా మంగళహారతి, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

- ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం బీసీ కాలనీలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. అలాగే సున్నంవారి చింతల, నేలటూరు, గుడినరవ, ఆర్లపడియ, ఉదయగిరి, జీ చెర్లోపల్లి, తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుని వేషధారణలో చిన్నారులు అలరించారు.
- ఆత్మకూరురూరల్: శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని మహిమలూరులోని పురాతన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, వాశిలిలోని వరదరాజస్వామి, మురగళ్ల, బట్టేపాడులోని కృష్ణ మందిరాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.
- కలిగిరి: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను బాలకృష్ణుడు, గోపికల్లా అలంకరించి ముచ్చట తీర్చుకున్నారు.
- చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం ఆదురుపల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తిని గరుడ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలతో పాల్గొని అలరించారు.
- సీతారామపురం : స్థానిక కురవవీధిలో యాదవయూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



సీతారామపురంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



అల్లూరులోని బ్రహ్మానంద గీతాశ్రమంలో..

- అల్లూరు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అల్లూరులోని బ్రహ్మానంద గీతాశ్రమంలో శ్రీకృష్ణుడికి విశేషాభిషేకాలు, పూజలు, గోపూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



దుత్తలూరు సెంటర్‌లో..

- దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలు, శ్రీకృష్ణుని భక్తి పాటలు ఆలపించారు. దుత్తలూరులోని శ్రీకృష్ణాశ్రమం, వేణుగోపాలస్వామి ఆలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం కోలాటాన్ని ప్రదర్శించారు.



వింజమూరు మండలం నల్లగొండ్లలో..

- వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపారు.



కావలిలో యాదవ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో..



సంగంలోని తూర్పువీధి కృష్ణ మందిరంలో..



సంగంలో అన్నప్రసాద వితరణ





ఏఎస్‌పేటలో..

మహాధర్నా జయప్రదానికి పిలుపు



సంగం: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఈ నెల 25న విజయవాడలో చేపడుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని డీఎస్సీ–2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ బత్తూరు మోహన్‌రావు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సంగంలోని విద్యావనరుల కేంద్రం వద్ద శనివారం ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57ను రాష్ట్రంలో అమలు చేసి 2004కు ముందుగా నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వ పాలనాపరమైన సమస్యల వల్ల నియామకాలు ఆలస్యమైనందున డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర శాఖల్లోని ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షులు నల్లమారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గాలి శివకుమార్, ఉపాధ్యాయులు కిషోర్, జయప్రకాశ్‌రెడ్డి, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



జలదంకి: బ్రాహ్మణక్రాక ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వరదారెడ్డి చారిటబుల్ ట్రస్టు తరుపున నగదు ప్రోత్సాహకాలను కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అందజేశారు. భార్గవి (591 ప్రథమ స్థానంలో నిలువగా రూ.25 వేలు, షేక్ అస్రిన్ (573) ద్వితీయస్థానంలో నిలవగా రూ.15 వేలు, నందిని (568) తృతీయస్థానంలో నిలవగా రూ.10 వేలు అందజేశారు. అలాగే 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇండ్ల సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోరుకు హెడ్ ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ వెంగమాంబపురంలోని చేతిబోరు మరమ్మతులకు గురవడంతో ఐదేళ్ల క్రితం హెడ్‌ను తొలగించారు. అప్పట్నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బోరును పట్టించుకోకపోవడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల 'సాక్షి'లో 'బోరుకు హెడ్ బిగించరూ' శీర్షికన కథనం రావడంతో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు స్పందించారు. శుక్రవారం బోరుకు హెడ్‌బిగించి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బలవంతపు భూసేకరణ తగదు



సోమశిల: ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ కంపెనీకి కోసం బలవంతంగా భూసేకరణ చేయడం తగదని రైతు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. కరేడులో బలవంతపు భూసేకరణను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 18న చేపట్టనున్న చలో కరేడు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను అనంతసాగరంలో శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ఎవ్వరూ వ్యతిరేకం కాదన్నారు. పరిశ్రమల స్థాపన విషయంలో ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పాలకులు వ్యవహరించాలన్నారు. కరేడులో ఇండోసోల్ ప్రాజెక్ట్ నిర్మాణానికి పచ్చని పంటలు పండే భూములను ఇవ్వబోమని చెబుతున్న రైతులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. న్యాయబద్ధంగా పోరాటం సాగిస్తున్న కరేడు రైతులకు అండగా నిలుస్తామన్నారు. ఈ నెల 18న చేపడుతున్న చలో కరేడు కార్యక్రమానికి రైతులు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, రైతు సంఘ మండల కార్యదర్శి మస్తాన్, నాయకులు సుబ్బారాయుడు, గాడి సుధాకర్, పెద్దమస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

లుంబినికి ఆపస్మా అవార్డు



చేజర్ల(సోమశిల): చేజర్లలోని లుంబిని విద్యాలయానికి ఆపస్మా ఎక్సలెన్స్ అవార్డు లభించింది. బాపట్ల జిల్లా చీరాలలో ఆపస్మా అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చీరాల ఎమ్మెల్యే ఎం మాలకొండయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా లుంబిని విద్యాలయ యాజమాన్యానికి అవార్డును ప్రదానం చేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో లుంబిని విద్యాలయం విద్యార్థిని 596 మార్కులు సాధించడంతో ఈ అవార్డును ప్రదానం చేసినట్లుగా లుంబిని యాజమాన్యం తెలిపింది

పేద విద్యార్థులకు అండగా సీడ్స్

- పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదన్నదే లక్ష్యం
- ఏటా 'పది'లో ప్రతిభకనబరిచే వారికి ఉపకారవేతనాలు
- ఉన్నత చదువులకు ఆరేళ్లపాటు రూ.2 లక్షల వరకు సాయం
- ఇప్పటికే 216 మందికి రూ.3.33 కోట్లు మంజూరు
- నేడు మరో 97 మందికి రూ.1.75 కోట్ల పంపిణీ



ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులు(ఫైల్)

దుత్తలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించే పేద విద్యార్థులకు సీడ్స్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తోంది. ఉన్నత చదువులు చదివేందుకు తగిన ఆర్థిక స్థోమత లేదని నిరుత్సాహపడకుండా ఆర్థిక సాయం అందజేస్తూ ప్రోత్సహిస్తోంది. దుత్తలూరుకు చెందిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులకు అండగా నిలిచేందుకు తన స్వగ్రామంలో సీడ్స్ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నారు. అంతేకాకుండా ఏటా పదో తరగతిలో ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులను గుర్తించి ఉన్నత చదువులకు ఉపకారవేతనాలు అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు. అందులోనూ తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులను గుర్తించి మరీ ప్రోత్సహిస్తున్నారు. 2009–10 విద్యా సంవత్సరం నుంచి సీడ్స్ సంస్థ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ ఉన్నత చదువులకు తోడ్పడుతున్నారు. 2022–23 నుంచి యువ అన్‌స్టాపబుల్ సంస్థ సహకారంతో ఏటా పేద విద్యార్థులకు రూ.2లక్షలు చొప్పున ఉపకారవేతనాలు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి ఇంటర్మీడియట్‌కు లక్ష, ఆపైన ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులకు ఏటా రూ.25 వేలు చొప్పున మరో రూ.లక్ష అందజేస్తున్నారు. ఇప్పటి వరకు 216 మంది విద్యార్థులకు రూ. 3.33 కోట్ల సాయం అందజేశారు. ఎడ్స్ సహకారంతో పేద విద్యార్థుల చదువులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొందరు చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు సాధించారు.

నేడు 97 మందికి ఉపకార వేతనాలు మంజూరు

దుత్తలూరులోని సీడ్స్ సంస్థలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి యువ అన్‌స్టాపబుల్ ద్వారా నూతనంగా ఉపకారవేతనాలకు ఎంపికైన 97 మందికి ఆదివారం మంజూరు పత్రాలను అందజేయనున్నారు. వీరికి రూ.1.74కోట్లను ఉపకారవేతనంగా మంజూరు చేయనున్నారు.

సాయం మరువలేనిది



మాది పేద కుటుంబం. చదువుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ వరకు సీడ్స్ సంస్థ అందించిన సాయం మరువలేనిది. సీడ్స్ సహకారంతోనే నేను ఈరోజు ఈ స్థితిలో ఉన్నాను. పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న సీడ్స్ సంస్థకు కృతజ్ఞతలు.

– షాహిదా, ప్రత్యేకాధికారి, కేజీబీవీ, సీతారామపురం

బీటెక్ చదువుతున్నా



పదోతరగతిలో మంచి మార్కులు సాధించాను. మా నాన్న బార్బర్. ఉన్నత చదువులకు ఆర్థిక సమస్య ఉన్న తరుణంలో సీడ్స్ ద్వారా ఉపకారవేతనాలు ఇస్తున్నారని తెలుసుకుని దరఖాస్తు చేశాను. నన్ను ఎంపిక చేసి ఉపకార వేతనం అందజేయడం ప్రస్తుతం బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాను.

– శ్రావణలక్ష్మి, మర్రిపాడు మండలం

సద్వినియోగం చేసుకుంటా



నా తల్లిదండ్రులిద్దరికీ ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. వారి మందులకే ఎంతో ఖర్చవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో పదో తరగతి పూర్తి చేసిన తనను గుర్తించి ఇంటర్మీడియట్ చదువుకు ఉపకారవేతనాన్ని అందించేందుకు ముందుకొచ్చిన సీడ్స్ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు.

–ఫౌజియా, దుత్తలూరు బీసీ కాలనీ